క్లుప్తంగా

గృహ ప్రవేశ వేడుకల్లో నేదురుమల్లి


సతీష్‌రెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి రూరల్: పట్టణానికి చెందిన ప్రముఖ నాయకులు పి.సతీష్‌రెడ్డి నూతన గృహ ప్రవేశ వేడుకల్లో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని త్రిభువని సెంటర్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో సతీష్‌రెడ్డి నివాసానికి శనివారం గృహప్రవేశం చేశారు. ఆ వేడుకల్లో నేదురుమల్లి పాల్గొని సతీష్‌రెడ్డి దంపతులను ఆశీర్వదించారు.

వైఎస్‌ఆర్ సీపీ పూర్వ వైభవానికి కృషి

వెంకటగిరి రూరల్: వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి వెంకటగిరి నియోజకవర్గంలో పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో శనివారం వైఎస్‌ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో రాష్ట్ర పర్యటన చేయనున్నట్లు తెలిపారు. పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎస్.బాలయ్య, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, వహిద, చిట్టేటి హరికృష్ణ, ఎం.వెంకటేశ్వర్లు, సీహెచ్ మురళీ, సతీష్, పేటీరాజ్, అల్లంసాయి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


క్రీడాకారులతో పరిచయం

చిట్టమూరు: మండలంలోని కొత్తగుంట గ్రామంలో ఉన్న టీఎంఆర్. కళాశాలలో శనివారం వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న పబ్లిక్ పరీక్షల్లో బాగా రాసి మంచి ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ రహంతుల్లా, మేనేజర్ ఆశా సీనయ్య, పీఈటీ మురళి పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సు ఆదాయ మార్గం

చిల్లకూరు: మహిళలు బ్యూటీషియన్ కోర్సు నేర్చుకోవడం ఆదాయ మార్గమని సునీతా సేవా సంస్థ నిర్వాహకులు తెలిపారు. గూడూరు పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న సంస్థ కార్యాలయంలో శనివారం బ్యూటీషియన్ కోర్సును ఆరంభించారు. బలిజ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు పద్మావతి, సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మీ, సువర్ణలక్ష్మీ, ఉమాదేవి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల మరమ్మతులకు నిధులు

కలువాయి: ఎస్సీ బాల, బాలికల హాస్టళ్ల మరమ్మతులకు రూ.34.50 లక్షలు నిధులు మంజూరైనట్లు ఏఎస్‌డబ్ల్యూఏ బ్రహ్మానందచారి తెలిపారు. కలువాయిలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ తీరును తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలుర వసతి గృహం మరమ్మతులకు రూ.14.25 లక్షలు, బాలికల వసతి గృహం మరమ్మతులకు రూ.20.25 లక్షలు మంజూరు చేశారని వివరించారు. త్వరలో మరమ్మతు పనులు చేపడుతామన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ఓజిలి: ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న పోషన్ భీ-పఢాయి భీ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. శిక్షణ తరగతుల్లో సీడీపీఓ కె.ఉమామహేశ్వరీ పాల్గొని కార్యకర్తలకు సూచనలు సలహాలు అందించారు. సూపర్‌వైజర్ సుజన, సీహెచ్ఓ సుబ్బరామయ్య, హెచ్‌ఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనం వద్దు

కోట: శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలను శ్యాంసుందరపురం ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసే ప్రతిపాదనను విరమించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఎంఈఓ మస్తానయ్యకు వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా కాలనీలో ఉన్న పాఠశాల ఎంతో అనుకూలంగా ఉందన్నారు. పాఠశాల మార్పుతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీవాసులు ఇచ్చిన వినతిపత్రాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఆక్వా జోన్‌లో కలిపితే రాయితీలు

చిట్టమూరు: నాన్ ఆక్వా జోన్‌లోని భూములను ఆక్వా జోన్‌లో కలిపితే పలు రకాల రాయితీలు వర్తించే వీలుంటుందని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రఘుబాబు సూచించారు. మండల కేంద్రమైన చిట్టమూరు, మల్లాం సచివాలయాలలో శనివారం ఆక్వా సాగుదారులతో సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కొత్తగా 134 హెక్టార్ల ఆక్వా సాగు చేసే భూములను ఆక్వా జోన్‌లోకి తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆక్వా రైతులు సుముఖత వ్యక్తం చేస్తే సిఫారసు చేస్తామన్నారు. మత్స్యశాఖ అసిస్టెంట్ వెంకటరమణ పాల్గొన్నారు.


మంగళంపాడులో మల్చింగ్ షీట్ ద్వారా మిరప సాగు

మల్చింగ్ సాగు..
లాభాలు బాగు
- ఆసక్తి చూపుతున్న రైతులు

రైతులు పంట సాగు చేసిన ప్రతి సారి అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో రైతులకు జామ, పుచ్చ, మిరప తదితర పంటలను మల్చింగ్ షీట్ పద్ధతిలో పండిస్తే బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విధానంలో డ్రిప్ నీటి పారుదల ఉండడంతో అధిక వర్షాలు వచ్చినా, స్వల్ప వర్షాలు వచ్చినా మొక్కల పెరుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– సూళ్లూరుపేట రూరల్

సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లోని సుమారు 18 వేల మంది రైతులు ఉన్నారు. ఇందులో ఎక్కువగా 30 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తుంటారు. అయితే వేసవిలో నీటి సమస్యలు ఉండడంతో ఎక్కువ మంది రైతులు మల్చింగ్ షీట్ పద్ధతిలో పండించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికి రాయతీ కూడా ఇస్తుండడంతో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లోని అనేక మంది రైతులు మిరప 150 ఎకరాలు, పుచ్చ 30 ఎకరాలు, జామ 5 ఎకరాల్లో మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్నారు.

అనేక ప్రయోజనాలు

చిన్న పంటలు కూడా మల్చింగ్ ద్వారా పండిస్తే వర్షా భావ పరిస్థితిలో నీటిని ఆదా చేసుకోవచ్చు. మల్చింగ్ కింద డ్రిప్ పైపు ఉండడంతో ప్రతి మొక్కకు నీరు సమృద్ధిగా అందుతుంది. చెట్టు కింద భూమి పొడిగా ఉండి వేరు వ్యవస్థ ఆరోగ్యంగా పెరుగుతుంది. కలుపును నివారించవచ్చు. డ్రిప్ ద్వారా వేసిన ఎరువు మొక్కలకు బాగా అందుతుంది. మల్చింగ్ షీట్‌పై పంటలు పండిస్తే భారీ వర్షాలు పడినా తెగుళ్లు తక్కువగా వస్తాయి. పంట నాణ్యతతోపాటు దిగుబడి పెరుగుతుంది. దీంతో పాటు 1 ఎకరా నుంచి 5 ఎకరాల్లోపు రైతులకు 90 శాతం రాయితీ అందుతుంది. ఐదు ఎకరాలు పైబడి ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీ ఉంటుంది.

మల్చింగ్ పద్ధతి ప్రయోజనకరం



ఇటీవలే రైతులు మల్చింగ్ షీట్ ద్వారా మిరప, పుచ్చ, జామ తదితర పంటలు సాగు చేస్తున్నారు. దీని వల్ల రైతులు అధిక ప్రయోజనాలు పొందవచ్చు. ఈ పద్ధతి వల్ల రైతులకు అన్ని పంటలలో వేరు వ్యవస్థ బాగా ఉండి తెగుళ్ల నివారణ, అధిక దిగుబడి, తక్కువ నీటి వాడకం, కలుపు నివారణ ఇలా అనేక ప్రయోజనాలుంటాయి

– యామిని, ఉద్యానశాఖ అధికారి

పంట దిగుబడి బాగా వస్తుంది



గత కొంత కాలంగా మల్చింగ్ షీట్ ద్వారా మిరప పంట నాలుగు ఎకరాల్లో రాయితీపై పండిస్తున్నాను. పంటకు మల్చింగ్ షీట్ ప్రయోజనకరంగా ఉంది. ముఖ్యంగా కూలీల ఖర్చు తగ్గుతుంది. తక్కువ నీటితో పంట పండించవచ్చు. దిగుబడి కూడా బాగా వచ్చే అవకాశం ఉంటుంది.

– చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, ఉగ్గుమూడి గ్రామం

మదరసా విద్యార్థి ప్రతిభ


చూడకుండా ఖురాన్‌ను వినిపిస్తున్న విద్యార్థి

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట అక్బరియా మసీదు వద్ద ఉన్న దారుల్ ఉలూం యూసిఫియా మదరసాలో చదువుతున్న అబూ బకర్ సిద్ధిక్ అనే విద్యార్థి ప్రతిభ చాటాడు. ఒకే రోజులో శనివారం పూర్తి ఖురాన్‌ను చూడకుండా కంఠస్థం చేసి వినిపించి ప్రతిభ చూపాడని మదరసా ఉపాధ్యాయులు మౌలానా షబ్బీర్ అహ్మద్ తెలిపారు. విద్యార్థి ప్రతిభను గుర్తించేందుకు నెల్లూరు, తమిళనాడు సేలం నుంచి ఆధ్యాత్మిక గురువులు హాఫీజ్ సమిఉల్లా, బర్కత్ అలీ సమక్షంలో తప్పు లేకుండా ఖురాన్‌ను వినిపించాడన్నారు. ఈ విద్యార్థిని ఆధ్యాత్మిక గురువులు అభినందించి బహుమతులు అందజేశారు. షాహిద్ మౌలానా, ఎంఏ మాలిక్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ


రాపూరు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీహరి

రాపూరు: విజయనగరం జిల్లా గడివిడిలో ఈ నెల 10నుంచి 14వరకు జరిగిన 12వ రాష్ట్రస్థాయి అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీల్లో రాపూరు వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ శ్రీహరి తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు శనివారం అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్ బాలుర విభాగం, బాలికల డిస్కస్ త్రోలో ప్రథమ స్థానం సాధించారన్నారు. బాలుర కబడ్డీ, బాలికల క్యారమ్స్, బాలికల షాట్‌పుట్, బాలుర డిస్కస్‌త్రో, 200మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు వివరించారు. విద్యార్థులు బహుమతులు సాధించేందుకు కృషి చేసిన వ్యాయామ అధ్యాపకుడు పెంచలయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విశాలి, శివ, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అండగా ఉంటా..
– కార్యకర్తలకు నేదురుమల్లి అభయం


దాసరిరాజు శంకర్‌రాజును పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: కార్యకర్తలు, నాయకులకు 24 గంటలూ అండగా ఉంటానని వైఎస్‌ఆర్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభయం ఇచ్చారు. మండలంలోని రామసాగరం గ్రామ సర్పంచ్ వెంకటరత్నం తల్లి పెంచలమ్మ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని నేదురుమల్లి స్వయంగా వెళ్లి పెంచలమ్మ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన గోనిసేని రవిని ఇటీవల టీడీపీ నేతలు దాడి చేసి గాయపరిచారు. ఆయన్ను కూడా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. తుమ్మలతలుపూరులో చెందిన వైఎస్‌ఆర్ సీపీ నేత వెంకటప్పనాయుడు, అన్నంరాజుపల్లి గ్రామానికి చెందిన దాసరిరాజు శంకరరాజును ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ కూటమి నేతల అక్రమ కేసులపై ఆందోళన చెందొద్దని ధైర్యంగా ఉండాలని సూచించారు. మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్‌యాదవ్, గుంటమడుగు శ్రీనివాసరాజు, వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, నేతలు రామ్‌గోపాల్‌రెడ్డి, మోహన్‌రావు, విజయభాస్కర్‌రెడ్డి, అభిరాజు, మాలకొండారెడ్డి, గోగినేని శివకుమార్, మస్తాన్‌నాయుడు, రాజశేఖర్ నాయుడు, ప్రకాష్, ఆదిశేషయ్య నాయుడు, వరప్రసాద్‌రాజు, గుమ్మడి వీరాస్వామి, రవి, దయాకర్‌రెడ్డి అనంతమడుగు ఎంపీటీసీ వెంకటరమణయ్య తదితరులు ఉన్నారు.

అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

దొరవారిసత్రం: గ్రామ పంచాయతీ కేంద్రమైన శ్రీధనమల్లి గ్రామంలో సంపద తయారీ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు స్థానిక పాలకులు, సచివాలయం సిబ్బంది చర్యలు చేపట్టారు. ఆరు రోజుల కింట సాక్షి దినపత్రికలో 'శిథిలావస్థలో సంపద తయారీ కేంద్రం' అనే శీర్షికన ప్రచురితం కావడంతో సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌మస్తాన్ స్పందించారు. తొలుత తయారీ కేంద్రానికి చుట్టూ ఉన్న ముళ్ల చెట్లను యంత్రంతో తొలగించి శుభ్రం చేశారు. అనంతరం తయారీ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో పంచాయతీ నిధులతో మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తామని పంచాయతీ కార్యదర్శి తెలియజేశారు.

ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు

పెళ్లకూరు: మండలంలోని అర్లపాడు గ్రామం సర్వే నంబరు 311/3లో సన్నాడి గోపీనాథ్‌రెడ్డికి సంబంధించిన వ్యవసాయ భూమికి ఉన్న హద్దురాళ్లను తొలగించడంపై డిసెంబర్ 13న పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని శనివారం బాధితుడు ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. బాధితుడి కథనం మేరకు వ్యవసాయ పొలానికి దక్షిణహద్దుగా ఉన్న హద్దురాళ్లను అదే గ్రామానికి చెందిన చిల్లకూరు మునివర్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి దౌర్జన్యంగా తొలగించి, బోరు నీళ్లను మళ్లించుకున్నట్లు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. స్థానిక పోలీసులు స్పందించకపోవడంతో డిసెంబర్ 21న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామన్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని, పూర్తి స్థాయిలో విచారించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

చిన్నారుల ఆరోగ్య స్థితిగతులపై సర్వే


సర్వే చేస్తున్న అడ్వొకేట్ గాంధీ

వెంకటగిరి రూరల్: చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించి ప్యానల్ న్యాయవాది అద్దంకి గాంధీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది శనివారం డోర్ టు డోర్ సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాలు, వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి ఓ.అనూష సూచనల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే వివరాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలియజేశారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

దొరవారిసత్రం: జాతీయ రహదారి దాటుతున్న పెంచలయ్యను అటుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలు... ముత్రాసపాళెం గ్రామానికి చెందిన పెంచలయ్య డీవీ సత్రంకి పని మీద వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న సమయంలో సూళ్లూరుపేట నుంచి నాయుడుపేట వైపు వేగంగా వెళ్లుతున్న బైక్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో పెంచలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. 108లో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా విగ్రహ ప్రతిష్ట


సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న దాతలు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీసిద్ధలయ్య కోన ఆవరణలో నూతనంగా నిర్మించిన సాయినాథ స్వామి దేవస్థానంలో మహా కుంభాభిషేక మహోత్సవాల్లో శనివారం నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. ఆలయ నిర్మాణ దాతలు ఆదూరు గిరిబాబు, అరుణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. స్వామివారి శిలా విగ్రహ ప్రతిష్టకు మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు కుమారుడు శిద్ధా సుధీర్‌కుమార్ పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వీక్షించేందుకు నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణ శర్మ పర్యవేక్షణలో సాగింది.

విద్యా ప్రమాణాలు మెరుగు పడాలి


వరగలి క్లస్టర్ సమావేశంలో ఎంఈఓ సనత్‌కుమార్

చిల్లకూరు: విద్యార్థుల అభ్యసనాలపై శనివారం మండలంలోని ఆరు చోట్ల నిర్వహించారు. ఈ క్లస్టర్ సమావేశంలో వరగలి జిల్లా పరిషత్‌లో జరిగిన సమావేశానికి ఎంఈఓ సనత్‌కుమార్ పాల్గొన్నారు. ప్రయాణ వసతులు సక్రమంగా లేక పోవడంతో క్లస్టర్ సమావేశాలకు హాజరయ్యేందుకు ఇబ్బందికరంగా ఉందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

చిట్టమూరులో..

చిట్టమూరు: క్లస్టర్ పరిధిలోని పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని క్లస్టర్ హెచ్‌ఎం భూపయ్య తెలిపారు. మండలంలోని గునపాడు పాఠశాలలో శనివారం క్లస్టర్ సమావేశం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లుగా వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం, రాజ్‌కుమార్, సంతోష్, శ్రీనివాసులు, భారతి, పెంచలయ్య, శివప్రసాద్, సుబ్బయ్య వ్యవహరించారు. ఎంఆర్‌సీ సిబ్బంది నాగమ్మ, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి


రాపూరులో అవగాహన సదస్సు

రాపూరు: గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత దూరమవుతుందని ఎంపీడీఓ భవాని పేర్కొన్నారు. రాపూరు హిందూ ప్రాథమిక పాఠశాల్లో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌భీ -పడాయిభీ అనే కార్యక్రమంపై మూడవ రోజుల అవగాహన తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రాధిక, ధనమ్మ, ఏఈ సర్దార్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

దక్కిలి: పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణుల్లో వచ్చే రక్తహీనతను నివారించవచ్చునని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేగం అన్నారు. పోషణ్ బీ-పడాయి బీలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు దక్కిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మూడో రోజు జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. అంగన్ వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి అనూష

దక్కిలి: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని వెంకటగిరి సివిల్ జడ్జి అనూష అన్నారు. మండలంలోని డీ వడ్డిపల్లి గ్రామంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు, జాతీయ మహిళా కమిషన్, మండల న్యాయ సేవా సంఘం అధ్వర్యంలో మహిళలకు న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డీవడ్డిపల్లి, దక్కిలిలో ఉన్న బీసీ హాస్టళ్లను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ చెంచమ్మ, ఎస్‌ఐ శివశంకర్, ఎంఈఓ-2 జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ



రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం శ్రీపెనుశిలలక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిలకు శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం నిత్యకల్యాణ మండపంలో స్వామిఅమ్మవార్ల కల్యాణం ఆగమోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించి పునీతులయ్యారు.

వస్తున్న పెన్షన్ ఆపేశారు



వెంకటగిరి రూరల్: వస్తున్న పెన్షన్ ఆపేశారంటూ ఓ దివ్యాంగుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో వెంకటగిరి రూరల్ మండలంకు సంబంధించి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డితోపాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరయ్యాయి. మండలంలోని వల్లివేడు గ్రామానికి చెందిన వెంకటాద్రికి వస్తున్న పింఛన్ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం నాలుగు నెలల నుండి ఇవ్వడం లేదుంటూ అతని తల్లి సరోజనమ్మ కార్యాలయం ముందు ఆవేదన వ్యక్తం చేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి



వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి శనివారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ శానిటేషన్, తాగునీరు సరఫరా, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. మున్సిపల్ సిబ్బంది నూతన కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అపహరణ



బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామంలో గుర్తు తెలియని దొంగలు వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న కాపర్ వైర్‌ను, ఆయిల్‌ను చోరీ చేసి ట్రాన్స్‌ఫార్మర్ విడి పరికరాలను సమీప పొలాల్లో పడేసి వెళ్లిపోయారు. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు ఘటనలపై బాలాయపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రామదాసు కుటుంబానికి పరామర్శ

వెంకటగిరి (సైదాపురం): వెంకటగిరిలో ప్రముఖ సీనియర్ న్యాయవాది బీరం రామదాసు గత కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. ఈ మేరకు కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ వెంకటగిరిలోని బీరం రామదాసు నివాసం వద్దకు చేరుకున్నారు. ఆయన చిత్రపటానికి నివాళిలర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో వెనుకబడి ఉన్న వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి నియోజకవర్గాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు


అటవీ శాఖ భూములను పరిశీలిస్తున్న అధికారులు

దక్కిలి: అటవీ భూములు ఆక్రమిస్తే మాత్రం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వెంకటగిరి ఇన్‌చార్జి రేంజర్(ఎఫ్ఆర్ఓ) లోకేష్ తెలిపారు. మోపూరు రోడ్డులోని ఆల్తూరుపాడు రోడ్డు మార్గంలో ఉన్న అటవీ భూమిలో దక్కిలి సౌత్, నార్త్ డీఆర్ఓలు, సిబ్బందితో కలిసి శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వే నెంబరు-1లో ఉన్న భూమి అటవీ శాఖకు చెందిందన్నారు. ఏడాది కిందట మోపూరు రోడ్డు సెంటరుకు చెందిన ఎస్టీలు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించగా వారిపై కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించామన్నారు. అయినా కూడా కొంత మంది అప్పటి నుంచి ఈ భూమిని అక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ నెల13వ తేదీన సోమవారం 100 మంది దాకా వచ్చి ఆక్రమించేందుకు ప్రయత్నించారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఆదివారం నుంచి సర్వే నెంబరు-1లో రెవెన్యూ, పోలీసుల సహకారంతో 144, 145 సెక్షన్లు అమలులో ఉంటాయన్నారు. అనంతరం పలు ప్రాంతాలను పరిశీలించారు. సౌత్, నార్త్ డీఆర్ఓలు ప్రతాప్‌రెడ్డి, కోటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి మృతదేహానికి పోస్టుమార్టం

నాయుడుపేట టౌన్: పట్టణంలోని స్వర్ణముఖి నది సమీపంలో రమణ మహర్షి ఆశ్రమంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న వేలూరు గణేష్(30) మృతదేహానికి ప్రభుత్వ వైద్యశాలలో శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. తిరుపతి ప్రాంతానికి చెందిన గణేష్ 8 నెలలుగా నాయుడుపేట పట్టణంలోని ఆశ్రమంలో ఉంటున్నాడు. పోలీసులు కూడా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి శనివారం గణేష్ మృతదేహానికి ప్రభుత్వ వైద్యులతో పోస్టుమార్టం జరిపించారు. మృతుడి తల్లిదండ్రులు వేలూరు రవి, గోవిందమ్మలతోపాటు కుటుంబ సభ్యులు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల వద్దకు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ


రోడ్డు భద్రతపై ఏర్పాటు చేసిన మానవహారం

కలువాయి: వివేకానంద పాఠశాల విద్యార్థులు, అధికారులు రోడ్డు భద్రతపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల నుండి ర్యాలీగా వెళ్లి బస్టాండులో మానవహారం ఏర్పాటు చేశారు. నినాదాలతో రోడ్డు భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ శ్రీధర్, ఏఎస్‌ఐ రమణయ్య, ఆర్‌ఐ సుధీర్‌బాబు, వీఆర్ఓ రవి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టైంస్కేల్ సాధనకు జిల్లా సదస్సు


గూడూరులో కరపత్రాల పంపిణీ

గూడూరు రూరల్: మినిమం టైంస్కేల్ సాధన కోసం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్(సీఐటీయూ) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ శనివారం కరపత్రాలను పంపిణీ చేశారు. గూడూరు పాత బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, ఉద్యోగులు, ప్రజలకు అందజేసి, అవగాహన కల్పించారు. సీఐటీయూ గూడూరు పట్టణ కార్యదర్శి సురేష్, ఆర్టీసీ హైర్ బస్సుల యూనియన్ అధ్యక్షుడు వై.రమణయ్య, కమిటీ సభ్యులు శీనయ్య, కార్యదర్శి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 53.270 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 53.270 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 720, లోలెవల్ కాలువకు 150, హైలెవల్ కాలువకు 190, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.